ప్రజాశక్తి

మంగళవారం 5 ఆగస్టు 2025

5

విజయనగరం

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ప్రతిభ స్కాలర్‌షిప్‌లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. సోమవారం తన ఛాంబర్‌లో విద్యార్థులకు చెక్కు ప్రశంసా పత్రం అందజేశారు. క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ సంస్థ తరఫున ఇండియా ఫౌండేషన్ ద్వారా సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బొబ్బిలి మండలం గొల్లపల్లి, గంట్యాడ మండలం లక్కిడాం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన నలుగురు విద్యార్థులకు పదివేల రూపాయలు చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రమణమూర్తి, గ్రామీణ లిమిటెడ్ ప్రతినిధులు బి.వెంకటరమణ, పి.చక్రధరరావు, ఆర్.తిరుపతి, బి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పని చేయని ఫోన్లు మాకొద్దు

- ఐసిడియస్ కార్యాలయాల వద్ద సెల్‌ఫోన్లతో అంగన్వాడీల నిరసన
- పిఒలకు ఫోన్లు అప్పగింత
- ఎఫ్అర్ఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

పని చేయని ఫోన్లతో తాము పనిచేయలేమని, 2జి ఫోన్లు తమకొద్దంటూ, అంగన్వాడీ కేంద్రాల్లో ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలంతా సోమవారం సిడిపిఒ కార్యాలయాల వద్ద నిరసనలు తెలిపారు. అనంతరం తమ సెల్‌ఫోన్లను పిఒలకు అప్పగించారు. అంగన్వాడీలకు ఇచ్చిన మొబైల్ ఫోన్లు 2జి కావడం, ఎఫ్ఆర్ఎస్ అవ్వకపోవడంతో అంగన్వాడీలంతా మూకుమ్మడిగా సెల్‌ఫోన్లను కార్యాలయాల్లో అప్పగించే కార్యక్రమాన్ని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన చేపట్టారు. కొన్నిచోట్ల కార్యాలయ సిబ్బంది ఫోన్లు తీసుకోగా, మరికొన్ని చోట్ల ఫోన్లు తీసుకునేందుకు సిబ్బంది నిరాకరించడంతో అంగన్వాడీలు కార్యాలయాల్లో తమ ఫోన్లను పడేసి వెనుదిరిగారు. బాడంగిలో సెల్‌ఫోన్లను తీసుకోపోవడంతో అంగన్వాడీలు ధర్నా చేపట్టారు.

**కంటోన్మెంట్ :** విజయనగరంలో సెల్‌ఫోన్లతో అంగన్వాడీలంతా నిరసన తెలిపారవు. వాటిని అధికారులకు ఇవ్వగా, తీసుకునేందుకు ఐసిడిఎస్ సిబ్బంది నిరాకరించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ సిబ్బంది ఫోన్లు తీసుకునేందుకు నిరాకరించినా ఆ ఫోన్లతో పనిచేయవద్దని పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.పైడిరాజు మాట్లాడుతూ ఈ ఫోన్లో వలన అంగన్వాడీలు మానసిక ఒత్తిడి గురై అనారోగ్యం పాలవుతున్నారన్నారు. సంస్థ ఇచ్చిన ఫోన్లు వాసన్ ట్రాకర్ బాల సంజీవని యాప్ అమలుకు సపోర్ట్ చేయడం లేదన్నారు. కార్యక్రమంలో విజయనగరం అర్బన్ ప్రాజెక్ట్ కార్యదర్శి కె.ప్రభావతి అధ్యక్షురాలు సునీత, మంగలక్ష్మి, స్వాతి, రాజీసరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

**చీపురుపల్లి :** పురాతన కాలం నాటి 2జి ఫోన్లు ఇచ్చి పని చేయాలని చెప్పి తమని ఇబ్బంది పెట్టడం సరి కాదంటూ చీపురుపల్లి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు తమ ఫోన్లను ఐసిడియస్ పిఒకు అప్పగించారు. తొలుత ఐసిడియస్ కార్యాలయం వద్ద ఫోన్లతో నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు టివి రమణ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఎసి అని, ఎఫ్ఆర్ఎస్ అని చెప్పి ఆన్‌లైన్ ద్వారా కెవైసిని అప్‌లోడ్ చేయాలని చెప్పి పురాతన కాలం నాటి 2 జి ఫోన్లు ఇచ్చి యాప్‌ల ద్వారా పనులు చేయమంటే నెట్ వర్క్ పనిచేయక అంగన్‌వాడీలు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. టి.మాలతి మాట్లాడుతూ తాము ఏం పాపం చేసామని తమకు ప్రభుత్వ పథకాలను ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అంగన్‌వాడీ నాయకులు బి.నాగమణితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజాంలో సెల్‌ఫోన్లతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

**రాజాం:** పనిచేయలేని ఫోన్లతో పని చేయలేమని అంగన్‌వాడీ కార్యకర్తలు తేల్చి చెప్పారు. స్థానిక ఐసిడిఎస్ ఆఫీసు వద్ద సెల్‌ఫోన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ పనిచేయని ఫోన్ల వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. నేటి నుంచి ఆన్‌లైన్ వర్ చేయలేమని, అంగన్వాడీలు సెంటర్లో హాజరు, లబ్దిదారులు ఆహారం సరుకులు పంపిణీ మొత్తం రికార్డులో రాస్తారని తెలిపారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, మినీలను మెయిన్ వర్కర్లుగా మార్చుతూ జీవో ఇవ్వాలని డిమాండ్ చేసి సెల్‌ఫోన్లను అధికారులకు అందించారు. యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షు కార్యదర్శులు సిహెచ్ రూపావతి, జయలక్ష్మి, సెక్టార్ లీడర్స్ సుజాత, పార్వతి, భారతి, సునీత, దమయంతి, ధవలేశ్వరి, అనురాధ, ప్రమీల, సుశీల, కుమారి తదితరులు పాల్గొన్నారు.

**బాడంగి:** పనిచేయని సెల్‌ఫోన్లు ఎందుకని, వెంటనే వాటిని తీసుకుని కొత్త ఫోన్లు ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలంతా నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లు పోషణ ట్రాకరు, బాల సంజీవని యాప్ అమలకు సపోర్ట్ చేయడం లేదన్నారు. లబ్ధిదారులకు ఫోటో క్యాప్చర్, ఒటిపి, ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన అమలు చేయటానికి అంగన్వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అనంతరం తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లను అధికారులకు అందించగా వారు నిరాకరించడంతో ధర్నా చేశారు. దీంతో ఫోన్లను తీసుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్. రమణమ్మ, లక్ష్మి, అరుణ, సిఐటియు మండల నాయకులు బి.శ్రీను అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

బాడంగి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద బైఠాయించిన అంగన్వాడీలు

**బొబ్బిలి:** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ క్యార్యకర్తలు నిరసన తెలిపి, అనంతరం తమ సెల్‌ఫోన్లను సిడిపిఒకి అప్పగించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు బి.నిర్మల, జె.కామేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం 2జీ సెల్‌లు ఇవ్వడం వల్ల ప్రభుత్వం పెట్టిన యాప్‌లు పనిచేయడం లేదన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 42 రోజులు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు నేటి ప్రభుత్వం అమలు చేయకపోవడం దారుణమన్నారు.

**శృంగవరపుకోటం :** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి సిడిపిఒ అచ్యుతాంబకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ముత్యాలు మాట్లాడారు. పాత మొబైల్ ఫోన్ల ద్వారా ఆన్‌లైన్ వర్క్ చేయబోమని, ఆఫ్ లైన్ ద్వారా పాత పద్ధతుల్లో రికార్డ్ మెయింటినెన్స్ చేస్తామని అన్నారు. అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

**గజపతినగరం :** కాలం చెల్లిన ఫోన్లతో తాము విధులు నిర్వహించలేమని గజపతినగరం అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు సుభాషిని, కార్యదర్శి జ్యోతి అన్నారు. పనిచేయని ఫోన్లు మాకొద్దు అంటూ గజపతినగరం ఇంచార్జ్ సిడిపిఒ, సూపర్వైజర్లకు తమ ఫోన్లను అందజేశారు. 11 రకాల రిజిస్టర్స్ ఫోనో అప్‌లోడ్ చేసేందుకు 2జి ఫోన్లు సరిగ్గా పనిచేయడం లేదని, తమకు ట్యాబులు, 5 జి నెట్వర్క్ తో ఇచ్చేవరకు రిజిస్టర్ పుస్తకాల్లో మంగళవారం నుంచి నమోదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో సెల్‌ఫోన్లతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

బొబ్బిలి సిడిపిఒ కార్యాలయం వద్ద సెల్‌ఫోన్లతో అంగన్వాడీల నిరసన

సర్వే అధికారులను అడ్డుకుంటున్న కాకర్లవలస గిరిజనులు

## సాగు భూమికే పట్టాలివ్వాలి

### రిజర్వ్ ఫారెస్టు భూములు వద్దు
### సర్వేను బహిష్కరించిన కాకర్లవలస గిరిజనులు

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల పరిధిలోని కాకర్లవలస, కారేడువలస గిరిజన గ్రామాల్లో సోమవారం రిజర్వు ఫారెస్టు, రెవెన్యూ అధికారులు చేపట్టిన భూ సర్వేను గిరిజనులు బహిష్కరించారు. తాము దశాబ్దకాలం నుంచి సాగు చేస్తున్న భూములకే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వే చేయడానికి వచ్చిన అధికారులను నెట్టివేయడమే కాకుండా గిరిజనులు పోలీసులతో తీవ్ర వాగ్వివాదం చేశారు. తమ భూములు కాకుండా ఎక్కడో కొండమీద ఉన్న రిజర్వు ఫారెస్టు భూములు తమకు కేటాయించడం ఎంతవరకు సబవని ప్రశ్నించారు. కొండలను తమకు అప్పగించి తాము సాగు చేస్తున్న భూములను లాగేసుకోవడంపై గిరిజనులు తీవ్రంగా మండిపడ్డారు. పార్వతీపురం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మహేంద్ర ఆధ్వర్యంలో ఒకటీమ్, మండల సర్వేయర్ వంగపండు సాయికుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులతో ఒక టీము ఆ గ్రామం వెళ్లి నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా గిరిజనులంతా ససేమిరా అన్నారు. ప్రస్తుతం తాము సాగుచేసుకుంటున్న భూములు తప్ప వేరే చర్చలు లేవని ఖరాకండిగా తేల్చి చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోను ఆర్ఎఫ్ఆర్ భూముల్లోకి తాము వెళ్లబోమని తేల్చి చెప్పారు. దీంతోఎస్ఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసులు మోహరించి వారికి నచ్చజెప్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఎపిఐఐసికి కేటాయించిన భూములను గిరిజనులు ఎలా స్వాధీనం చేసుకుంటారని అధికారులు ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమి గిరిజనులకే దక్కుతుందని సిఐటియు నాయకుడు బలసా శ్రీను స్పష్టం చేశారు. దీంతో రెవెన్యూ, ఫారెస్టు అధికారులు వెనుదిరిగారు. ఈ ఆందోళనలో గిరిజన నాయకులు తౌడమ్మ, లక్ష్మీ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## ఒప్పంద కార్మికులకు కనీస వేతనం అమలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఒప్పంద కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం అమలు చేయాలని కలెక్టర్, జిల్లాస్థాయి కనీస వేతన కమిటీ చైర్మన్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జరిగిన జిల్లాస్థాయి కనీస వేతన కమిటీ సమావేశంలో జూలై 2025 నుండి జూన్ 2026 వరకు చెల్లించవలసిన కనీస వేతనాన్ని కమిటీలో నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్ స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనం రూ.51 నుండి స్కిల్డ్ లేబర్ కు రూ.526 వరకు, పట్టణ ప్రాంతాలలో అన్ స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనం రూ.910నుంచి స్కిల్డ్ లేబర్‌కు రూ.950 వరకు చెల్లించాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. నిర్ణయించిన ధరల ప్రకారం ఒప్పంద కార్మికులకు వేతనాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కార్మికశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బి శాఖ ఎస్ఇ కాంతిమతి, సిపిఒ పి బాలాజీ, కార్మిక శాఖ ఉప కార్మిక కమిషనర్ ఎస్‌డివి ప్రసాద్ రావు పాల్గొన్నారు.

## సమస్యలకు పరిష్కారం చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఆర్జీలు రీ ఓపెన్ కాకుండా సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులకు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి , డిప్యూటి కలెక్టర్ లు వెంకటేశ్వర రావు, ప్రమీలా గాంధీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్జీల పరిష్కారం పై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువు లోగా పరిష్కారం చేయాలని అదేశించారు. అర్జీల పరిష్కారంలో, ఉన్నతాధికారుల అదేశాల అమలులో కొంతమంది అధికారులు అలసత్వం వహిస్తున్నారని, అర్జీలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్జీల పరిష్కారంపై రోజువారీ సమీక్ష నిర్వహించు కోవాలన్నారు. ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 198 అర్జీలు అందజేశారు .

## రోడ్డు ప్లాన్ మార్చాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డెంకాడ మండలం గుణుపూరుపేటలో వీఎంఆర్‌డిఎ మాస్టర్ ప్లాన్ 2041ను రద్దు చేసి, పాతప్లాన్ ప్రకారం తమకు న్యాయం చేయాలని ఆ గ్రామ రైతులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ అంబేద్కర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా రైతులు అప్పలరాజు, ఈశ్వరరావు మాట్లాడుతూ తాజాగా విఎంఆర్‌డిఎ విడుదల చేసిన మాస్టర్ ప్లాను ప్రకారం తమ గ్రామంలో 80 మీటర్ల రోడ్డు సర్వే నెంబరు చెరువు ఆయకట్టుమీదుగా పోతుందన్నారు. దీని వలన ఊరిలో సుమారు 200 మంది రైతులకు చెందిన 500ఎకరాల సాగు భూమిలో ఈరోడ్డు వెళ్తుందన్నారు. దీనివలన మాఊరిలో వ్యవసాయం, చేనుకుని అవకాశం లేక, తాము వలస పోవాల్సి వస్తుందన్నారు. కావున విఎంఆర్‌డిఎ ప్లాన్‌ను 2021లో విడుదల చేసిన మాస్టరు ప్లాను ప్రకారం రోడ్డు ఇవ్వాలని కోరారు.

## రైతు సమస్యలు పరిష్కరించాలి

### కలెక్టర్‌కు వైసిపి నాయకుల వినతి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లాలో యూరియాతో సహా ఎరువులు కొరతను తీర్చడంతో పాటు రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని జెడ్‌పి చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు వైసిపి ఆధ్వర్యాన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం రైతులకు అనేక హామీలు ఇచ్చినా అమలు చేయడం లేదన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద సంవత్సరానికి రూ.20వేలు ఇస్తామని, జూన్ 2024 నుంచే దీన్ని అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. ఈ రెండేళ్లకు ప్రతి రైతుకూ రూ.40వేలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.5వేలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. అంతేకాక 7లక్షల మందికి ఈ పథకాన్ని కోత పెట్టారన్నారు. దీనివల్ల వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతులు అధిక వడ్డీలతో ప్రైవేటు అప్పుల మీద ఆధారపడే పరిస్థితిని సష్టించారని విమర్శించారు. ఉచిత పంటల బీమాను రద్దుచేశారని, గత ఏడాది ఇన్సూరెన్సు చెల్లించకపోవడంతో రైతులకు బీమా డబ్బులు రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులకు సున్నావడ్డీ పథకాన్ని కూడా ఎత్తివేశారని విమర్శించారు. ప్రైవేటు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. యూరియా కేటాయింపులకు, సరఫరాకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. పొటాష్ కలిసిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు అమాంతం పెరిగిపోయాయన్నారు. రైతులు ఓవైపు కష్టాలు పడుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కనీసం సమీక్షలు చేసే పరిస్థితికూడా కనిపించడంలేదన్నారు. రైతుల సమస్యల పట్ల ప్రభుత్వం చాలా ఉదాసీనతతో వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడు, వైసిపి అనుబంధ విభాగాలు అధ్యక్షులు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు రైతు సమస్యలను వివరిస్తున్న వైసిపి నాయకులు

## రైతుల పక్షపాతి టిడిపి : ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి-విజయనగరం కోట

తెలుగు దేశం పార్టీ రైతులు పాక్ష పాతి అని స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని గొల్లలపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించాఉరు. ఇంటింటికి వెళ్లి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. అనంతరం సభలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ రైతు ప్రభుత్వంగా గుర్తింపు పొందామని తెలిపారు. పెన్షన్ పెంపు, అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు సాయం అందించామన్నారు. లో వోల్టేజిని అధిగమించేందుకు కొత్తగా సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇంకా ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు పాసి అప్పలనాయుడు, టిడిపి మాజీ సర్పంచ్ ఈగల సత్తిబాబు, ఎంపిటిసి రమణ ,మండల పార్టీ అధ్యక్షుడు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## చివరి ఆయకట్టు వరకూ నీరందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఖరీఫ్‌లో ఆయకట్టు చివరి భూములు వరకు సాగునీరు అందించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ భవనంలో నీటి పారుదల శాఖ, తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు నుండి జూలై 6న నీరు విడుదల చేశారని, ఈ ప్రాజెక్టు కింద జిల్లాలో 12 మండలాల్లో 55444 ఎకరాల ఆయకట్టు ఉందని, 35 కాలువల ద్వారా వాటికి నీటిని అందిస్తామని తెలిపారు. నీటి సక్రమ పారుదలకు వారా-బంది పద్ధతి పాటించాలని అన్నారు. వారా-బంది పద్ధతిలో సాగునీటిని సక్రమంగా పంపించుటకు రెవిన్యూ, పోలీస్ మరియు నీటి పారుదల శాఖ సిబ్బందితో తనిఖీ బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. నీటి చౌర్యం జరగకుండా తనిఖీ బృందాలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీటిని సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తోటపల్లి బ్యారేజ్ ప్రోజెక్టు ఎస్.ఈ. కెవిఎన్ స్వర్ణకుమార్, నీటిపారుదల, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు, జర్నలిస్టులు

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

### ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన నిరసన
### కలెక్టర్ అంబేద్కర్‌కు వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన విజయనగరం, పార్వతీపురం జిల్లా కేంద్రాలతోపాటు ఆయా జిల్లాల్లోని 16 మండల కేంద్రాల్లో జర్నలిస్టులు నిరసనలు తెలిపారు. అనంతరం అధికారులకు వినతులు అందజేశారు. విజయనగరం జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంలో గల గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు ధర్నా చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జర్నలిస్ట్ డిమాండ్స్‌డేగా పాటించాలంటూ ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా జర్నస్టులు నిరసనలు చేపట్టారు. విజయనగరంలో జరిగిన ధర్నానుద్దేశించి ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.రమేష్ నాయుడు, నాయకులు విజయలక్ష్మి, యుగంధర్ మాట్లాడారు. దీర్ఘకాలంగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చొవర చూపాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోవడం వల్ల జర్నలిస్టులకు భద్రత కొరవడుతోందని, బెదిరింపులు, వేధింపులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కూడా ప్రభుత్వం ఆలోచించడం లేదన్నారు. ముఖ్యంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పెన్షన్ మంజూరు చేయాలని, మీడియా కమిటీ వేయాలని, కొత్త అక్రిడేషన్లు ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక ప్రచురణ పునరుద్ధరించాలని, సమాచారశాఖను బలోపేతం చేయాలని, జర్నలిస్టులకు రైలు ప్రయాణంలో రాయితీ కల్పించాలని, ఎసి బస్సుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మీడియా అకాడమికీ గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత, కార్మిక బీమా సదుపాయం వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు బూరాడ శ్రీనివాసరావు, నాగరాజు, విజయలక్ష్మి, సునీతారెడ్డి, జి.సూరిబాబు, బి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. విజయనగరం జిల్లా కేంద్రంతోపాటు నెల్లిమర్ల, గరివిడి, ఎస్.కోట, వేపాడ, రామభద్రపురం, వంగర, రేగిడి, బొబ్బిలి, బాడంగి మండలాల్లోనూ, పార్వతీపురం జిల్లా కేంద్రంతోపాటు కురుపాం, కొమరాడ, సాలూరు, సీతానగరం, భామిని మండలాల్లో స్థానిక తహశీలార్లకు వినతులు అందజేశారు.

## రాజ్యాంగ విరుద్ధ సర్క్యులర్‌ను రద్దు చేయాలి

### ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సర్కులర్ కాపీలు దగ్ధం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సర్కులర్ 30/67/ 2025ను రద్దు చేయాలని కోరుతూ ఆ సర్కులర్ ప్రతులను సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తుందని అన్నారు. విద్యా సంస్థల్లో విద్యార్థి సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు మనకు రాజ్యాంగం ఎప్పుడో ఇచ్చిందని, దాన్ని రద్దు చేయడం సరైనది కాదని అన్నారు. పాఠశాలల్లో పేరుకుపోయిన సమస్యలపై దృష్టి పెట్టాల్సిన విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యార్థి సంఘాలను నిషేధించాలంటూ ఇటువంటి రాజ్యాంగ వ్యతిరేక సర్కులర్ జారీ చేయడం తగదన్నారు. విద్యార్థి సంఘాలను నిషేధిస్తున్న ప్రభుత్వం, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలకు ఏ విధంగా అనుమతిస్తుందని ప్రశ్నించారు. తక్షణమే ఈ విద్యా వ్యతిరేక సర్కులర్ రద్దు చేయాలని లేనియెడల రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు, జె.రవికుమార్ , సహాయ కార్యదర్శి శిరీష నాయకులు జగదీష్, మురళి పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బకాయి జీతాలు చెల్లించాలని, ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్మికులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం డిఆర్ఒ శ్రీనివాసమూర్తికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి మేజర్ పంచాయతీ కార్మికులకు బకాయి జీతాలు, ధరలకు అనుగుణంగా రూ.26వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకి కనీసం పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కూడా లేదన్నారు. ప్రభుత్వం గ్లౌజులు, యూనిఫామ్, షూస్, పనిముట్లు, రక్షణ పరికరాలు ఇవ్వడం లేదన్నారు. టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, మరణించిన కుటుంబాలను .15వేల రూపాయలు మట్టి ఖర్చులకు ఇచ్చి, 5 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ నాయకులు కోటేశ్వరరావు, జనార్దన్, భవానీ, శ్యామల, వెంకట్, భాస్కర్ రావు, పైడిరాజు, సంతోష్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతన్న పంచాయతీ కార్మికులు

### పని భద్రత కల్పించాలని ఆటో కార్మికుల ధర్నా

మహిళలకు ఉచిత బస్సులు వేయడం వల్ల ఆటో కార్మికుల జీవనోపాధి దెబ్బతింటుందని, అందువల్ల పని భద్రత కల్పించడంతో పాటు వాహనమిత్ర కింద రూ.15వేలకు తగ్గకుండా ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆటో కార్మికులు ఎఐఎఫ్‌టియు ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐ ఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు గణేష్ పండా, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అప్పలరాజు,రెడ్డి నారాయణరావు మాట్లాడారు. ప్రవేటు పిట్నెస్ సెంటర్లు ఎత్తివేయా లని, ఆటో డ్రైవర్లకు రూ.5 లక్షలు భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు, త్రైక్వాండో మాస్టర్

## ఆత్మరక్షణపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - గంట్యాడ

మండలంలోని గంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆత్మరక్షణ మెలకువలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. మండలంలోని 13 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. త్రైక్వాండో మాస్టర్ శ్రీనివాస్ శిక్షణను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ విజయకుమారి, గంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రుస్సీ, ట్రైనింగ్ ఎస్ఐ పి.నాని, గంట్యాడ పోలీస్ స్టేషన్ రైటర్ ఐ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సోంపురం పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు సోమవారం సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజుతో కలసి పాఠశాల పరిసరాలు, ప్రార్థన, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్ మొదలగువవి పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు, చదివించడం రాయించడం, చతుర్విధ ప్రక్రియలు చేయించడం, విద్యార్థుల హోమ్ వర్క్ పరిశీలించి, 10వ తరగతి విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

## నేడు బానాదిలో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాది సత్య సాయిబాబా మందిరం వద్ద మంగళవారం విశాఖకు చెందిన శంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల కంటి వ్యాధి గ్రస్తులకు ఉచిత వైద్య సేవలు అందిస్తారు. ఉదయం 8 గంటల నుంచి నిర్వహించే వైద్య శిబిరానికి పరిసర ప్రాంతాల్లో గల కంటి వ్యాధిగ్రస్తులు వైద్య సేవలు పొందవచ్చునని శంకర ఫౌండేషన్ యాజమాన్యం తెలిపింది.

## 'ప్రజలను మోసగిస్తున్న చంద్రబాబు'

ప్రజాశక్తి - బొండపల్లి

సూపర్ సిక్స్ పథకాల అమలులో చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేస్తున్నారని ఎంపిపి చల్ల చలంనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు, గొట్లాం పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు మహంతి రమణ అన్నారు. మండలంలోని గొట్లాం, బోడసింగిపేట గ్రామాలలో సోమవారం 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గొట్లాం సర్పంచ్ ఆదిలక్ష్మి, మండల వైసిపి యూత్ అధ్యక్షులు బోడసింగి జగదీశ్వరరావు, రాచకిండం పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గొల్ల సతీష్, మాజీ ఎంపిటిసి మండల రామునాయుడు, వైస్ ప్రెసిడెంట్ కడగల గోవింద్, సిడగం నారాయణరావు, తాళ్లపూడి జనార్దన్‌రావు, తాళ్లపూడి అప్పలనాయుడు, రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## డబ్బులు పడని రైతులు కంగారు పడొద్దు

ప్రజాశక్తి - డెంకాడ

అన్నదాత సుఖీభవ డబ్బులు పడని రైతులు కంగారు పడొద్దని ఈ ప్రక్రియ ఇంకా వారం రోజుల కొనసాగే అవకాశం ఉందని ఎఒ టి. సంగీత తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమెను కలిసిన రైతులతో మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకంలో డబ్బులు జమకాని రైతులు సమీప రైతు సేవా కేంద్రంలో రైతు వన్‌బి, ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబరు ఇవ్వాలని సూచించారు. వరికి సంబంధించి పంట ఇన్సూరెన్స్ ఆగస్టు 15లోపు చేసుకోవాలని తెలిపారు.

## పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన కామ్రేడ్ గర్భాపు పుష్ప నాదం 5వ వర్ధంతిని పురస్కరించుకొని తన సోదరుడు గర్భపు శాంతి కుమార్ ( టీచర్ ) పెరుమాలి ఏపీ మోడల్ స్కూల్ లైబ్రరీకి 150 పుస్తకాలు వితరణ చేశారు. లైఫ్ ట్రీస్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా 30 మంది వాలంటీర్లు సహకారంతో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ గాయత్రి, ఎస్ఎంసి చైర్మన్ రామినాయుడు, టిడిపి నాయకుడు జగన్నాథరాజు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు ఆక్రమణలను తొలగించండి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

తహశీల్దార్‌కు వినతినిస్తున్న రైతులు

రాయి వాని చెరువు ఆక్రమణలు తొలగించాలని మండలంలోని పోతనపల్లి, కృష్ణాపురం రైతులు సోమవారం తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాయివాని చెరువు ఆక్రమణ వల్ల తమ పొలాలకు దారి లేకుండా పోయిందని, చెరువు గర్భం ఆక్రమణ వల్ల సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెరువును సర్వే చేసి హద్దులు నిర్ణయించి రైతులు మళ్లు వడ్డకు వెళ్లేందుకు ఉన్న దారిని యథావిధిగా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చొక్కాకుల ఏరినాయుడు, పైల శ్రీను, నారాయణ, సత్యారావు, సూరిబాబు పాల్గొన్నారు.

## వీధుల్లో అసిస్టెంట్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య పనితీరును గమనించారు. రహదారికి ఇరుకున ఉన్న చెత్తలు, పొదలను తొలగించి వేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ ఏ విధంగా జరుగుతుందో కొన్ని ప్రాంతాల్లో గమనించారు. తడి చెత్త పొడి చెత్త సేకరణ ఆవశ్యకతను ఉన్నప్పటికీ శతశాతం చెత్త సేకరణ జరగాలని విధంగా మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ ఇళ్లకు వచ్చే సిబ్బందికి తడి చెత్త పొడి చెత్త వేరు చేసే అందించాలని సూచించారు. అనంతరం అన్నక్యాంటీన్ను సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార విధానాన్ని పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు.

కిట్లను పంపిణీ చేస్తున్న వైద్యులు భార్గవరేఖ

## ఫైలేరియా కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని రెల్లివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.భార్గవరేఖ ఆధ్వర్యంలో సోమవారం ఫైలేరియా బాధితులకు రోగ నిర్వహణ కిట్లు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వివిధ గ్రామాల్లో నివసిస్తున్న ఫైలేరియా రోగులకు ఈ మార్బిడిటీ మేనేజ్‌మెంట్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ కిట్ల వాడకంతో రోగ తీవ్రతను తగ్గించుకోవచ్చు అన్నారు. కిట్లలో ఉన్న పదార్థాల వినియోగం ద్వారా వ్యాధి నియంత్రణ సాధ్యపడుతుందని చెప్పారు. ఫైలేరియా వ్యాధి క్యూలెక్స్ అనే దోమకాటు ద్వారా వ్యాప్తిస్తుందన్న విషయాన్ని గ్రామస్థులకు వివరించారు. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురికినీటి నిల్వలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒ రమణమూర్తి, డిప్యూటీ హెచ్ఇ శివ, హెచ్‌వి లలిత, హెచ్ఎస్ వర్మతో పాటు పలువురు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# స్మార్ట్‌మీటర్లు వద్దని ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అదానీ స్మార్ట్‌మీటర్లు మాకొద్దు..పాతమీటర్లు మార్చొద్దు అంటూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం 4వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు.స్మార్ట్‌మీటర్లు వద్దంటూ ఇంటింటికీ స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని చెప్పి మాట తప్పి ప్రజలను మోసగించారని, స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టండని చెప్పిన లోకేష్ నేడు ఇంటింటికీ మీటర్లు బిగించడం మోసం కాదా అని ఆయన ప్రశ్నించారు. కాలనీల్లో, పేదల ఇళ్లకు, అపార్ట్మెంట్ ల్లో స్మార్ట్ మీటర్లు బిగించేందుకు వస్తున్నారని, వారిని అడ్డుకొని స్మార్ట్‌మీటర్లను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విధ్యుత్ స్మార్ట్ మీటర్స్ వద్దు.. ట్రూ అప్ ఛార్జీలు రద్దు అని ప్రజలంతా నిరసన తెలపాలన్నారు. అదానీ స్మార్ట్ మీటర్ బిగిస్తే ముందే వేలాది రూపాయలు రీఛార్జి చేసుకుని, భారీగా బిల్లులు వస్తాయని తెలిపారు.కావున ప్రజలంతా స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించాలని తెలిపారు.

విజయనగరం: ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

### విద్యుత్తు స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

**కొత్తవలస:** అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని చెప్పి మాట తప్పి ప్రజలని మోసగించారన్నారు. స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టండని చెప్పిన లోకేష్ నేడు ఇంటింటికి మీటర్లు బిగించడం మోసం కాదా అని ప్రశ్నించారు. కాలనీల్లో, పేదల ఇళ్ళకి అపార్ట్‌మెంట్‌ల్లో అదాని విద్యుత్తు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఇప్పటికే వస్తున్నారని వాటిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఈ విద్యుత్ భారం మోయలేక పోతున్నామని దానికి తోడు స్మార్ట్ మీటర్లు బిగిస్తే ముందే వేలాది రూపాయలు రీఛార్జ్ చేసుకుని, భారీగా బిల్లు వస్తే భరించలేమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మికులు, ఆటో కార్మికులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

కొత్తవలస: ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

## నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడ, నెల్లిమర్ల సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. చెట్టు కొమ్మలు తొలగింపు, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం సతివాడ 33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి రామతీర్థం రూరల్ ఫీడర్ మీద పినతరిమి, పెద తరిమి, బొప్పడాం, బొడ్డపేట, మధుపాడ, సతివాడ కల్లాలు, వల్లూరు, నెల్లిమర్ల 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో గుర్ల 11కెవి రూరల్ ఫీడర్ మీద మొయిద నారాయణ పట్నం, పూతికపేట, కొండగుంపాం, గరికిపేట, చింతలపేట, పెద మజ్జి పేట గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

మాట్లాడుతున్న ఇంఛార్జి ఎంపిడిఒ

## ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. వేతన దారులకు సక్రమంగా వేతనాలు అందించడం, పని ప్రదేశంలోనే ఇకెవైసి చేయడం, వేతనదారుని ఆధార్‌కార్డు తప్పనిసరిగా అప్లోడ్ చేయడం, నిర్ధారించిన స్థలంలోనే వేతనదారులు పనిచేయడం వంటి అంశాలపై ఈ శిక్షణ నిర్వహించారు. ఈ విధానం వల్ల తప్పుడు మస్తర్లు వేసేందుకు అవకాశం ఉండదని ఇంఛార్జి ఎంపిడిఒ రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ఆదిలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# తల్లి పాలు అమృతంతో సమానం : పిఒ

ప్రజాశక్తి - కొత్తవలస

తల్లిపాలు అప్పుడే పుట్టిన బిడ్డలకు అమృతంతో సమానమని ఐసిడిఎస్ పిఒ ఉమాదేవి తెలిపారు. మండలంలోని వియ్యంపేటలో సోమవారం తల్లి పాలు వారోత్సవాలలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు తల్లిపాలు అవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలలో విటమిన్లు, ఖనిజ లవణాలను కలిగి ఉంటాయని, రోగనిరోధక శక్తిని కలిగిస్తాయని, తల్లి పాలు బిడ్డ పుట్టిన వెంటనే తాగించాలని, ఆరు నెలలు వరకు తల్లి పాలు మాత్రమే తాగించాలని తెలిపారు. పి.హెచ్.ఎన్ జగదాంబ మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలలో శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడతాయని తెలిపారు. సూపర్ వైజర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ తల్లి పాలు తాగించడం వల్ల తల్లీ, బిడ్డల మధ్య ప్రేమ, అనుబంధం, కలుగుతాయని, పిల్లలలో జ్ఞాపక శక్తి పెరుగుతుందని, తల్లికి రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌లు రావని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, సర్పంచ్ పులిబంటి జ్యోతి, ఎసిడిపిఒ లక్ష్మీ బాయి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.రమణమ్మ, కె.వెంకటలక్ష్మి, సి.హెచ్ నాగమణి, పిహెచ్ఎన్ జగదాంబ, హెచ్‌వి పద్మావతి, ఏఎన్ఎం లక్ష్మీ, ఆశ వర్కర్ వరలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్, తులసీ, రమణమ్మ, సత్య లక్ష్మీ, చెల్లయ్యామ్మా, అప్పడమ్మ, నారాయణమ్మలు పాల్గొన్నారు.

బొండపల్లి: అవగాహన కల్పిస్తున్న పిఒ ఉమా భారతి

**బొండపల్లి:** తల్లిపాలు శ్రేష్టమైనవి అని తప్పనిసరిగా ప్రతి తల్లీ తమ బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని గంట్యాడ ఐసిడిఎస్ పిఒ ఉమా భారతి అన్నారు. సోమవారం మండలంలోని దేవుపల్లి గ్రామంలో బొండపల్లి సెక్టార్ ఆధ్వర్యంలో తల్లి పాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గర్భిణీ దశ నుంచి పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు లబ్ధిదారుల గృహాలకు వెళ్లి అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు మాసాలు పూర్తి అయ్యినంత వరకూ కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ రామతులసి, దేవుపల్లి పిహెచ్‌సి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఎంఎస్‌కెలు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సేవలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - రామభద్రపురం

అన్నదాతకు అందించే సేవల్లో కూటమి ప్రభుత్వం విఫలం అవడంతో రైతన్నలు తీవ్ర ఆర్థిక భారాలకు గురవుతున్నారని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక వైసిపి మండల పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో పశువ్యాధులకు సంబంధించిన మందులతో పాటు రసాయన ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోందన్నారు. ఇవి సకాలంలో దొరక్క రైతన్నలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం పశువులకు సంబంధించిన మందులు ఆర్ఎస్‌కెలకు సరఫరా చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని, దీంతో పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలినప్పుడు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. ఎరువుల విషయంలో కూడా సకాలంలో రైతులకు సరిపడా రైతు సేవా కేంద్రాలు ద్వారా పంపిణీ చేయడం లేదని ఎరువులు కోసం రైతులు నానాపాట్లు పడాల్సి వస్తోందని అన్నారు. ఎరువుల కోసం రైతులు ప్రయివేటు దుకాణాలను ఆశ్రయిస్తున్నారని అధిక ధరలకు కొనుగోలు చేస్తు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో సకాలంలో రైతు సేవలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే వారని గుర్తు చేశారు. ఇకనైనా స్పందించి రైతులకు సకాలంలో మెరుగైన సేవలు అందేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు డి.పైడిరాజు, కె.చంద్రశేఖర్, అప్పారావు, రామారావు పాల్గొన్నారు.

ఎరువులను పంపిణీ చేస్తున్న నాయకులు

## రైతులకు ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలోని బొద్దూరులో నియోజకవర్గ వాణిజ్యవిభాగం అధ్యక్షులు, ఎంపిటిసి వల్లూరు గణేష్, పిఎసిఎస్ చైర్మన్ చెలికాని మహేష్‌బాబు సోమవారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు విత్తనాలు అందించి వారికి అండగా ఉంటున్నామన్నారు. రైతులు మాట్లాడుతూ తమకు ఏ సమస్య వచ్చినా ఎంపిటిసి గణేష్, చైర్మన్ మహేష్‌బాబు ముందుడి పరిష్కరిస్తారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యర్కమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీనామాలు ఉపసంహరణ

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

నియోజకవర్గంలో జనసేన నాయకులు డైరెక్టర్ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన విషయం విధితమే. వారి రాజీనామాలపై నియోజకవర్గ ఇంఛార్జి మర్రాపు సురేష్ ఆధ్వర్యంలో సోమవారం పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మర్రాపు సురేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో, అటు మండల స్థాయిలో తమ జనసేన నాయకులకు, కార్యకర్తలకు గత రెండు మూడు నెలలుగా ప్రభుత్వ కార్యక్రమాల్లో, కార్యాలయంలో సరైన గుర్తింపు లేదనే ఆవేదనతో ఆదివారం డైరెక్టర్ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ సమన్వయకర్తగా తాను వారితో మాట్లాడి వారితో పాటు జనసేన కార్యకర్తలకు ఎటువంటి సమస్యలు భవిష్యత్తులో తలెత్తకుండా చూసుకుని విధంగా ప్రయత్నాలు చేస్తామని తెలపడంతో వారి రాజీనామా నిర్ణయాలను వెనక్కి తీసుకున్నట్లు తెలిపారు. ఇదే విషయంపై జనసేన నాయకులు, కలిగి పండు, కడమల శ్రీను, ఏఎంసి డైరెక్టర్లు కలిగి స్వాతి, పైల మహేష్, కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కడమల అప్పయ్యమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నియోజకవర్గ స్థాయిలో కానీ, మండల స్థాయిలో కానీ తమ మధ్య ఎటువంటి విభేదాలూ లేవని తెలిపారు. గతంలో డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తామన్న మాట వాస్తవమేనని అన్నారు. ఇదే విషయంపై తమ పెద్దలు దృష్టికి తీసుకుని వెళ్లడంతో వారి సూచన మేరకు రాజీనామా ఉపసంహరణ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తమకు మంత్రి శ్రీనివాస్ గత సంవత్సర కాలంలో అన్ని విధాల సహకరించారని, వారితో ప్రత్యేక అనుబంధం ఉందని, ఇకపై పెద్దలు, మంత్రి శ్రీనివాస్, జనసేన సమన్వయకర్త సురేష్ ఆధ్వర్యంలో కలిసికట్టుగా ముందుకెళ్లడమే తమ లక్ష్యం అని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన సీనియర్ నాయకులు బూర్లి రాము, ఆదినారాయణ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'మా చెప్పులతో మేం కొట్టుకోవాలి'

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఉద్యోగాలు వస్తాయని తమ పిల్లల భవిష్యత్తు బాగుంటుందని కంపెనీలో వాటా ఉంటుందని నమ్మి జిందాల్‌కు భూములు ఇచ్చినందుకు తమ చెప్పులతో తామే కొట్టుకుంటామని జిందాల్ బాధితులు అన్నారు. సోమవారం బొడ్డవరలో 45వ రోజు వారంతా చెప్పులతో కొట్టుకుంటూ నిరసన తెలిపారు. ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ మాట్లాడుతూ భూములు ఇచ్చిన రైతాంగానికి న్యాయం చేసేందుకు, ఇచ్చిన హామీలు నెరవేర్చేటట్టు జిందాల్ యాజమాన్యానికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతున్నామన్నారు. దేశంలో మిగిలిన కంపెనీలలో ఉద్యోగస్తుల్లా జిందాల్‌కి భూములు ఇచ్చిన వారికి ఉద్యోగం ఉంటుందని, జిందాల్ చెప్పినట్టుగానే కంపెనీలో వాటాతో పాటు మెరుగైన జీవనం ఉంటుందని, భూములతోనే బతుకుతున్న గిరిజన దళిత పేద రైతులు నమ్మి భూమి జిందాల్‌కు అప్పగిస్తే మోసం చేయడం ఎంతవరకూ సమంజసమన్నారు. భూములు ఇచ్చిన, త్యాగం చేసిన గిరిజన దళిత రైతులకు ఎటువంటి భరోసా దక్కపోగా కంపెనీ మాత్రం కోట్ల విలువైన ఆస్తిని అమ్మేయడానికి సిద్ధపడిందన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు నిరుపేదలుగా కునారిల్లుతున్న పేదరైతంగానికి మేలు చేయాలని జగన్ డిమాండ్ చేశారు.

### జిందాల్ బాధితుల వినూత్న నిరసన

చెప్పులు చూపిస్తూ నిరసన తెలుపుతున్న బాధితులు

# మాతా శిశు మరణాలను నివారించాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మాతృ, శిశు మరణాలను నివారించడానికి ప్రతీఒక్కరూ శాయశక్తులా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. మరణం తరువాత చేసేది ఏమీ ఉండదని, సాధ్యమైనంత వరకు చిత్తశుద్ధితో కృషి చేసి, ఆధునిక వైద్య సదుపాయాలు, తమ అనుభవం, వైద్య పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రాణాలను కాపాడాలని అన్నారు. తమ వల్ల కాదనిపిస్తే, వెంటనే నిర్ణయం తీసుకొని వీలైనంత త్వరగా పై ఆసుపత్రులకు పంపించాలని సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ఎంపిసిడిఎస్ఆర్ సమావేశంలో, ఏప్రియల్, మే, జూన్ నెలల్లో జిల్లాలో సంభవించిన మాతృ, శిశు మరణాలపై సమీక్షించారు. ఈ మూడు నెలల కాలంలో ఇద్దరు బాలింతలు, ముగ్గురు శిశువులు మృతి చెందినట్లు అధికారులు వివరించారు. ఆయా ఆసుపత్రుల్లో ఉన్న వసతులు, వైద్యుల గురించి ప్రశ్నించారు. బాలింతలు మృతిపై వైద్యారోగ్య శాఖ, ఐసిడిఎస్ అధికారులు సంయుక్తంగా మరోసారి విచారణ చేసి నివేదికలను అందజేయాలని ఆదేశించారు. కారకులైన సిబ్బందికి, అధికారులకు, ఆసుపత్రులకు మరోసారి షోకాజ్ నోటీసు ఇచ్చి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ శుభశ్రీరాణి, ఘోషాసుపత్రి గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ శుభశ్రీ, డిఐఒ డాక్టర్ అచ్యుతకుమారి, ఐసిడిఎస్ పీడీ టి.విమలారాణి, పలువురు వైద్యాధికారులు, ప్రయివేటు ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి సేతుమాధవన్

## నేరాలు ఘోరాలు

### గంజాయి కేసులో వ్యక్తి అరెస్టు

**శృంగవరపుకోట:** గంజాయి కేసులో ఏవన్ ముద్దాయిగా ఉన్న శ్రీజిత్ అనే వ్యక్తిని అరెస్టు చేశామని సిఐ నారాయణమూర్తి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత సంవత్సరం డిసెంబర్ నెలలో కేరళ రాష్ట్రానికి చెందిన బొలెరో వాహనం, ఇద్దరు వ్యక్తులతో పాటు 117 కేజీలు గంజాయిని పట్టుకుని అరెస్టు చేసామని, ఈ కేసులో కేరళ నుండి వెహికల్ పంపించి గంజాయి తీసుకొని రమ్మని చెప్పిన ఏవన్ ముద్దాయి శ్రీజిత్తును కేరళ రాష్ట్రంలోని, త్రిసూర్ జిల్లా, ముందపుల్లీ వెళ్లి అరెస్టు చేసి అక్కడ కోర్టులో ప్రవేశపెట్టి ఆ కోర్టు ఆదేశాల మేరకు సోమవారం ఎస్‌కోట తీసుకొని వచ్చి ఎస్‌కోట కోర్టులో ప్రవేశపెట్టాట్టి సెంట్రల్ జైలుకు పంపించామని ఆయన తెలిపారు.

### ఎన్‌టిఆర్ కాలనీలో విద్యుత్ పరికరాలు చోరీ

**నెల్లిమర్ల:** జరజాపుపేట ఎన్‌టిఆర్ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ పరికరాలు చోరీకి గురయ్యాయి. నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు సోమవారం అందించిన వివరాలు ప్రకారం.. జరజాపుపేట హై స్కూల్ సమీపంలో ఎన్‌టిఆర్ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో దొంగలు మోటార్ ట్రాన్స్ ఫార్మర్ పగలగొట్టి రాగి వైర్ తీసుకు వెళ్ళిపోయారు. ఉదయం ఇంటి పని చేసుకోవడానికి వెళ్ళిన వారు చూసి సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలాన్ని కౌన్సిలర్లతో కలసి పరిశీలించి ఎస్ఐ, ఎఇకి ఫిర్యాదు చేశాం. వెంటనే అధికార్లు స్పందించి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

### గుణిదాంలో కొట్లాట

#### నలుగురుకి గాయాలు

**చీపురుపల్లి** : మండలంలోని గుణిదాం గ్రామంలో ఇరు వర్గాల మధ్య కొట్లాట జరగడంతో పలువురుకి గాయాలయ్యాయి. సోమవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఎలా ఉన్నాయి. టిడిపికి చెందిన ఎర్ర సావిత్రమ్మ, ఎర్ర సురేష్, ఎర్ర సూర్యనారాయణ, ఎర్ర రాంబాబులు, వైసిపికి చెందిన ఎర్ర భాస్కరరావు, ఎర్ర సూర్యనారాయణ, గొలగాని రామారావు, ఎర్ర నారాయణమ్మల మధ్య సుమారు సెంటున్నర స్థలం కోసం వివాదం జరిగింది. ఈ వివాదంలో ఇరు గ్రూపులకు చెందిన వారు ఒకిరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో టిడిపికి చెందిన ఎర్ర సావిత్రమ్మ, ఎర్ర సురేష్, ఎర్ర రాంబాబు గాయపడగా, వైసిపికి చెందిన ఎర్ర నారాయణమ్మకు గాయ్యాలయ్యాయి. దీంతో ఇరు వర్గాల వారు చీపురుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. గాయాలు పాలైన వారిని స్థానిక ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం తరలించారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి : ఇంఛార్జి విసి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల 'సైబర్ సెక్యూరిటీ వర్క్ షాప్' సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్ మాట్లాడారు. డిజిటల్ యుగంలో వ్యక్తిగత, సంస్థాగత డేటాను సురక్షితంగా కాపాడుకోవడం ఎంతో కీలకమని తెలిపారు. ప్రతి విద్యార్థి, అధ్యాపకుడు, ఉద్యోగి సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా మాట్లాడుతూ, సైబర్ దాడులు కేవలం సాంకేతిక అంశాలు కాకుండా, విద్యా సంస్థల నైతికత, పరిపాలన, డేటా గోప్యతపై తీవ్రమైన ప్రభావం చూపుతాయన్నారు. వర్క్ షాప్‌లో హైదరాబాద్‌కు చెందిన రాపిడ్ స్కిల్స్ డైరెక్టర్, కో-ఫౌండర్ రోహిత్ తాడికొండ, ట్రైనర్ అమన్ ఎలుగం పాల్గొని, సైబర్ భద్రత, సురక్షిత డిజిటల్ ప్రవర్తన, డేటా రక్షణ తదితర అంశాలను వివరించారు. సమన్వయకర్తగా కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా. బొంతు కోటయ్య వ్యవహరించారు. పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు

## మహిళలకు రక్షణ కవచం శక్తి మొబైల్ యాప్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

మహిళలకు రక్షణ కవచంలా శక్తి మొబైల్ యాప్ పనిచేస్తుందని మహిళా పోలీసుస్టేషన్ డిఎస్‌పి ఆర్.గోవిందరావు అన్నారు. స్థానిక సెయింట్ మేరీ హైస్కూల్‌లో విద్యార్థినులకు సోమవారం శక్తి యాప్ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థినులకు మొబైల్ యాప్ ఏ విధంగా డౌన్లోడ్ చేయాలి, దారి పని తీరును గురించి వివరించారు. మహిళల మొబైల్ ఫోనులో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందని, ఒక కుటుంబ సభ్యుడు మీకు తోడు ఉన్నట్లేనన్నారు. మహిళలు ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తుల వాహనాలు, ఆటోల్లో ప్రయాణించినపుడు సేఫ్ ట్రావెల్ ఆప్షన్స్ క్లిక్ చేసి, చేరుకోవాల్సిన ప్రాంతాన్ని నమోదు చేస్తే, వారు సురక్షితంగా గమ్య స్థానానికి చేరుకొనేంత వరకు వారి ప్రయాణంపై పోలీసులు నిఘా పెడతారన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ శిరీష, వన్‌స్టాప్ సెంటర్ స్టాఫ్, శక్తి బందం కానిస్టేబుళ్ళు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమస్యలకు తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి - కంటోన్మెంట్

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని పోలీసు అధికారులకు ఎస్‌పి వకుల్‌జిందల్ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి 32 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

**మహారాజశ్రీ విజయనగరం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కోర్టు విజయనగరం**

**G.W.O.P. 13/2025**

Between:
అల్లూరి మాధవి దేవి .....వాది
And :
అల్లూరి శివకుమార్ ......ప్రతివాది
To
అల్లూరి శివకుమార్, S/o బుచ్చిరాజు, వయస్సు 41సం॥, R/o కిల్లుంతయ్ పాలెం, శృంగవరపు కోట మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు గల దావాను వాది గారు ప్రతివాదిపై వేయ్యగా పై కోర్టువారు వాదిని ఆర్డరు జారీచేసిన విధంగా ఈ నోటీసు పంపించడం జరిగింది. ఈ దావా **తేది 1-9-2025 ఉదయం 10-30 ని॥ల**కు మీరు గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ వాదనను తెలియజేయవలెను. లేని ఏడల శ్రీ కోర్టువారు మీకు పరోక్షంగా తీర్మానించుదురు అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

**కె.రవిబాబు**
అడ్వకేట్,
విజయనగరం,
సెల్ : 9440343921